
ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రభ
తెలుగు దినపత్రిక
గురువారం 26 మార్చి 2026




# అవినీతికి అడ్డాగా.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు..!





- ఏసీబీ అధికారులు రెండు రోజులు నంద్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయం పై దాడులు.
- రెండో రోజు సోదాలు..అక్రమాల పరంపరపై దర్యాప్తు వేగం.
- ఫోన్ పే ద్వారా పెద్ద ఎత్తున ట్రాన్సాక్షన్ జరిగినట్టు సమాచారం.
- జిల్లా రిజిస్టర్ అశోక్ కుమార్ కు బిగుసుకుంటున్న ఉచ్చు.
- పైసలిస్తే ఎవరి ఆస్తులు అయినా తారుమారు చేస్తారంటున్నా ప్రజలు.
- జిల్లాలోని అన్ని సబ్ రిజిస్టర్ కార్యాలపై దాడులు చేయాలంటున్న ప్రజలు.
- ఏసీబీ దాడులతో అధికార తీరు మారేనా..?

## ..డబుల్ రిజిస్ట్రేషన్లతో మోసం.

ఒకే స్థలం లేదా పొలాన్ని పలువురి పేర్లపై రిజిస్టర్ చేయడం (డబుల్ రిజిస్ట్రేషన్) వంటి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. డబ్బులు చెల్లిస్తే సరిపోతుందని భావించి వివాదాస్పద భూములకైనా రిజిస్ట్రేషన్లు చేయడం ద్వారా కొందరు అధికారులు,మధ్యవర్తులు కలిసి ప్రజలను మోసం చేస్తున్నారన్న ఆవేదన వ్యక్తమవుతోంది.ఈ విధంగా అమాయక ప్రజలు లక్షల రూపాయలు కోల్పోతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి.

### .నిబంధనలు పక్కనబెట్టి మధ్యవర్తుల రాజ్యం.

నియమాల ప్రకారం స్టాంప్ వెండర్లు కార్యాలయాల్లోకి రాకూడదు.అయితే వాస్తవంగా వారు కార్యాలయాల్లోనే కూర్చొని వ్యవహారాలు నడిపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఫైల్ కదలాలంటే మధ్యవర్తులే కీలకంగా మారడం,అధికారులపై వారి ప్రభావం పెరగడం ఆందోళనకరం.

### 'డబ్బులు ఇస్తే ఏదైనా రిజిస్ట్రేషన్' అన్న విమర్శలు.

ప్రభుత్వ భూములా,లిటిగేషన్ భూములా అన్న తేడా లేకుండా డబ్బులు ఇస్తే రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధమవుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది భూ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 25:**

నంద్యాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి ఆరోపణలపై చేపట్టిన ఆంధ్రప్రదేశ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సోదాలు రెండో రోజూ కొనసాగుతూ సంచలన అంశాలను వెలుగులోకి తెస్తున్నాయి. సోమవారం ప్రారంభమైన తనిఖీలు మంగళవారం రాత్రి వరకు సాగగా,కార్యాలయంలో వ్యవస్థీకృతంగా అక్రమాలు కొనసాగుతున్నాయనే అనుమానాలు బలపడుతున్నాయి.

### అనధికారుల రాజ్యం

తనిఖీలలో భాగంగా ముగ్గురు అనధికార వ్యక్తులు కార్యాలయంలో స్వేచ్ఛగా పనిచేస్తున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ సుమారు 12 మంది డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయంలోనే లావాదేవీలు జరుపుతున్నట్లు తేలింది.అధికారిక వ్యవస్థను పక్కనబెట్టి ప్రైవేట్ నెట్‌వర్క్ ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నడుస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఫోన్‌పే లావాదేవీలపై ఫోకస్.

డిజిటల్ చెల్లింపులపై కూడా ఏసీబీ ప్రత్యేక దృష్టి సారించింది.ఒక ఉద్యోగి మొబైల్‌లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన సురేఖకు ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేసిన స్క్రీన్‌షాట్లు లభించగా,మరో ఉద్యోగి జీతానికి మించి లక్షల్లో లావాదేవీలు నిర్వహించినట్లు ఆధారాలు బయటపడినట్లు సమాచారం.ఈ లావాదేవీల వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్‌పై అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు.

### మొబైల్ ఫోన్లు స్వాధీనం.

డాక్యుమెంట్ రైటర్ల మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు,వాటిలోని వాట్సాప్ చాట్‌లు,యూపీఐ లావాదేవీలు,బ్యాంక్ రికార్డులను పరిశీలిస్తున్నారు. లావాదేవీలకు సంబంధించి మధ్యవర్తుల పాత్రపై కూడా విచారణ కొనసాగుతోంది.

### సేవలు స్థంభనం ఆదాయానికి గండి.

రెండు రోజులుగా సోదాలు కొనసాగుతుండటంతో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు దాదాపు నిలిచిపోయాయి.దీంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గణనీయంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.పని నిమిత్తం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### గత చరిత్ర..మళ్లీ అదే పరిస్థితి..??

ఇదే కార్యాలయంలో గతంలోనూ ఏసీబీ దాడులు జరిగిన విషయం తెలిసిందే..!! అయినప్పటికీ అవినీతి పూర్తిగా అరికట్ట లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.ఈసారి అయినా కఠిన చర్యలు తీసుకుంటారా..?బాధ్యులపై ఎలాంటి చర్యలు ఉంటాయి.? అన్న దానిపై ఆసక్తి నెలకొంది.
సోదాలు కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. నంద్యాల పట్టణంలో ఇటీవల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన ఏసీబీ దాడులు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి.అక్రమ లావాదేవీలు,అనధికార సిబ్బంది వ్యవహారాలు, డిజిటల్ చెల్లింపుల ద్వారా జరిగే అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడంతో ప్రజల్లో ఒకవైపు ఆశ,మరోవైపు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "ఇంత పెద్ద స్థాయిలో దాడులు జరిగాకైనా అధికారుల పనితీరు మారుతుందా..??" అన్న ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తోంది. ఏసీబీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పద నగదు లావాదేవీలు,ఫోన్‌పే వంటి యాప్‌ల ద్వారా డబ్బుల బదిలీలు,మధ్యవర్తుల పాత్ర వంటి అంశాలు బయటపడినట్లు సమాచారం.ముఖ్యంగా, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం,ఫీజులకు మించి వసూళ్లు చేయడం వంటి ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తూనే ఉన్నాయి.ఈ నేపథ్యంలో జరిగిన దాడులు ప్రజలకు







కొంత నమ్మకం కలిగించినా,దీర్ఘకాలిక మార్పులు వస్తాయా అనే సందేహం మాత్రం అలాగే ఉంది. స్థానికులు చెబుతున్నదేమిటంటే, "దాడులు జరుగుతున్నప్పుడే కాస్త కట్టుదిట్టం ఉంటుంది. కొన్ని రోజులు గడిచాక మళ్లీ పాత పద్ధతులే కొనసాగుతాయి"అన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.రిజిస్ట్రేషన్ కోసం వచ్చే సాధారణ ప్రజలు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఇంకా కొనసాగుతుండటమే దీనికి నిదర్శనం అంటున్నారు.మరోవైపు,ఉన్నతాధికారులు మాత్రం ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది.బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు,కార్యాలయాల్లో సీసీ కెమెరాలు,ఆన్‌లైన్ సేవల విస్తరణ,నేరుగా ఫీజు చెల్లింపుల విధానాన్ని మరింత కట్టుదిట్టం చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం.ఈ చర్యలు కచ్చితంగా అమలు అయితే అవినీతి తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు..!! అయితే, ఒక్కసారిగా దాడులు చేయడం కంటే నిరంతర పర్యవేక్షణ,బాధ్యులపై కఠిన శిక్షలు,ప్రజల అవగాహన పెంపు వంటి చర్యలు తీసుకుంటేనే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. లేకపోతే,ఏసీబీ దాడులు కేవలం వార్తలకే పరిమితం అయ్యే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.
మొత్తానికి,నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన ఈ ఘటన ఒక హెచ్చరికలా మారింది. ఇప్పుడు చూడాల్సింది. ఈ హెచ్చరికతో అధికారుల వ్యవహార శైలి మారుతుందా..?లేక మళ్లీ పాత దారినే కొనసాగుతారా..? ప్రజలు మాత్రం స్పష్టమైన మార్పు కోసం ఎదురు చూస్తున్నారు.
నంద్యాల జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనితీరుపై తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నంద్యాల, పాణ్యం, సిరివెళ్ల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, అవుకు, ఆత్మకూరు, నందికొట్కూరు,డోన్ ప్రాంతాల్లోని కార్యాలయాల్లో అవినీతి పెచ్చుమీరిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా వెలుగులోకి వస్తున్న డబుల్ రిజిస్ట్రేషన్ల వ్యవహారం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

### ఏసీబీ దాడుల్లో బయటపడిన వ్యవహారాలు.

ఇటీవల జరిగిన ఏసీబీ దాడుల్లో మధ్యవర్తుల ద్వారా భారీగా డబ్బులు వసూలు చేసి,అధికారులకు చేరుతున్న వ్యవస్థ ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం.నగదు లావాదేవీలతో పాటు ఫోన్‌పే వంటి డిజిటల్ మార్గాల్లో కూడా అక్రమ బదిలీలు జరుగుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ..ప్రజలపై భారం.. అధికారులకు లాభం.

ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూనే ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని భారీగా సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొనడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

## చర్యలు ఉంటాయా.?
### లేక పాత పద్ధతులేనా..?

ఏసీబీ దాడుల అనంతరం ఉన్నతాధికారులు పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని భావిస్తున్నప్పటికీ,అవి అమల్లోకి వస్తాయా అన్నది సందేహంగా మారింది.సీసీ కెమెరాలు, ఆన్‌లైన్ సేవలు,నేరుగా చెల్లింపుల విధానం కచ్చితంగా అమలు చేస్తేనే మార్పు సాధ్యమని నిపుణులు సూచిస్తున్నారు.



## కాసులకు కక్కుర్తి పడి.. డబుల్ రిజిస్ట్రేషన్లు

రిజిస్ట్రేషన్లు,మధ్యవర్తుల దందా,అక్రమ వసూళ్లతో నంద్యాల జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాయి. ఏసీబీ దాడులు హెచ్చరికగా మారినా, అధికారుల తీరు మారుతుందా..? లేక మళ్లీ అదే పరిస్థితులు కొనసాగుతాయా..? అన్నది కాలమే నిర్ణయించాలి.ప్రజలు మాత్రం పారదర్శక సేవల కోసం ఎదురు చూస్తున్నారు.